క్రీడా పాఠశాలల్లో నేడు నాల్గో తరగతి విద్యార్థుల ఎంపిక

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 27: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి ఈ నెల 28వ తేదీన జిల్లా స్థాయిలో హకీంపేట క్రీడా పాఠశాలలో శిబిరాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఎనిమిది నుంచి తొమ్మిదేండ్ల మధ్య ఉన్న విద్యార్థులకు ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, పరుగు, వర్టికల్ జంపు, బాల్‌త్రో, వైద్య పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వయస్సు, విద్యార్హత, పుట్టిన తేదీ, 3వ ప్రగతి పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఎంపిక శిబిరానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

కృష్ణా నీటి సరఫరా పునరుద్ధరణ

సిటీబ్యూరో, జూన్ 27(నమస్తే తెలంగాణ): నాగార్జున సాగర్ నుంచి నగరానికి రెండో దశ కృష్ణా జలాల తరలింపులో భాగంగా కోదండపూర్ పంప్‌హౌజ్‌లో మరమ్మతులకు గురైన రెండో పంపు ఎన్‌ఆర్‌వీ వాల్వ్ పనులు గురువారం ఉదయం వరకు పూర్తయ్యాయని జల మండలి ట్రాన్స్‌మిషన్ విభాగం అధికారులు ప్రకటించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. కృష్ణా డ్రింకింగ్ సప్లయి ఫేజ్-2 పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

సిటీబ్యూరో, జూన్ 27(నమస్తే తెలంగాణ): వాటర్ వర్క్స్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నారాయణ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం జల మండలి నూతన ఎండీ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యల విషయంలో తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానని, అందరినీ కలిసి బోర్డు సేవలు మెరుగు పరుద్దామని ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, కుమార్ అంజనేయులు, సురేష్ బాబు, వీరస్వామి, మల్లేష్, ఆంజనేయులు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ కాలేజీ క్యాంటీన్‌లో అపరిశుభ్రత

ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెల్లడి
నిర్వాహకుడిపై చర్యలు

సిటీబ్యూరో, జూన్ 27(నమస్తే తెలంగాణ): కూకట్‌పల్లి జేఎన్టీయూ క్యాంపస్‌లోని కాలేజీ క్యాంటీన్‌లో అడుగడుగునా అపరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తేల్చారు. శ్రీ సాయి క్యాటరీస్ ఆధ్వర్యంలో క్యాంటీన్ నిర్వహణ కొనసాగుతుండగా, వంటగది అనారోగ్యానికి కేంద్రంగా ఉందని గుర్తించారు. వంటగదిలో పనిచేసే సిబ్బంది ఏ ఒక్కరికీ తలపాగా, గ్లౌజులు ధరించలేదు. కూరగాయలు పాడైనట్లుగా, వంటగది ఆవరణలో ఆహార వ్యర్థాలు చెల్లాచెదురుగా పడినట్లు గుర్తించారు. తలుపులు సరిగా లేవని, గడువు ముగిసిన 3.5 కిలోల బియ్యం పిండిని సీజ్ చేశారు. సంబంధిత శ్రీ సాయి క్యాటరీస్‌పై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

కుచించుకుపోతున్న గండిపేట కాండూట్

- అనుమతులు లేకున్నా..కాండూట్‌పై వంతెనలు
- బహుళ అంతస్తులకు ప్రధాన రహదారుల ఏర్పాటు

కాలువ కుచించుకుపోయి.. రోడ్డుపై పారుతున్న గండిపేట నీరు ఆక్రమణలను తొలగించాలని కోరుతున్న స్థానికులు పట్టించుకోని జలమండలి అధికారులు

మణికొండ, జూన్ 27 : గండిపేట చెరువు నీటిని నగరవాసులకు అందించేందుకు నిర్మించిన కాలువ(కాండూట్)కు కాలం చెల్లే రోజులు దగ్గరపడుతున్నాయి. అయితే.. కోకాపేట, పుప్పాలగూడ, మణికొండ గ్రామాల మీదుగా వెళ్లే గండిపేట కాలువ(కాండూట్) ఈ ప్రాంతాల్లో కాలువకు ఇరువైపులా బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమయ్యాయి. కాలువకు వంద అడుగుల దూరం వరకు జీవో 111 అమలులో ఉన్నదని, హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులకు తెలుసు. కానీ, బహుళ అంతస్తుల నిర్మాణాలను జీవో పరిధిలో నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుప్పాలగూడ బీఆర్సీ అపార్టుమెంటుకు ఎదురుగా ఓ సంస్థ బహుళ అంతస్తుల నిర్మాణాల రాకపోకల కోసం నిబంధనలకు విరుద్ధంగా కాండూట్‌పై సిమెంట్ కాంక్రీట్‌తో రహదారిని చేపట్టి రాకపోకలకు సిద్ధం చేసింది. జలమండలి సూచించిన మేరకు కాండూట్‌పై కల్వర్టు నిర్మించి దానిపై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కానీ, సదరు సంస్థ అవేమీ పట్టనట్లు దర్జాగా కాండూట్‌పై సిమెంటు పోసి ఆపై టైల్స్ వేసి రహదారిని నిర్మించింది. అంతటితో ఆగకుండా కాండూట్‌పై మట్టిపోసి వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కేంద్రాలను సదరు బిల్డర్లు ఏర్పాటు చేశారు.

కాండూట్‌ను తవ్వి మొక్కలు నాటేందుకు చదును చేస్తున్న సదరు అపార్టుమెంటు నిర్మాణదారులు

రోడ్డు పాలవుతున్న గండిపేట నీరు..

గతంలో కాలువపై కొన్ని వ్యాపార కేంద్రాలతో పాటు ఇటీవల అపార్టుమెంట్ల రాకపోకలకు కాలువపై రహదారులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కాలువ కుచించుకుపోవడంతో ఎగువ ప్రాంతాల్లో వేల లీటర్ల తాగునీరు భూమి పాలవుతున్నది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు జలమండలి అధికారులకు తెలిపినా తాత్కాలిక చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రహదారుల నిర్మాణాలకు అనుమతులు లేవు..

గండిపేట చెరువు నుంచి నగరానికి తరలించే కాలువ(కాండూట్)కు ఇరువైపులా వంద మీటర్ల వరకు జీవో 111 అమల్లో ఉంది. చాలా చోట్ల ఆక్రమణలు చేసిన వారికి ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశాం. కానీ ఇటీవల కొన్నిచోట్ల ఇష్టానుసారంగా కాండూట్‌పై వ్యాపార కేంద్రాల నిర్వహణపై చర్యలు తీసుకున్నాం. బీఆర్సీ సమీపంలో ఓ అపార్టుమెంటు నిర్మాణదారులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా మొండిగా వ్యవహరిస్తున్నారు. అలాంటి ఆక్రమణలను త్వరలోనే కూల్చివేస్తాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నరహరి, జలమండలి డీజీఎం (గండిపేట సెక్షన్)

మెడిసిన్ విద్యార్థి చదువుకు బీఎల్ఆర్ ట్రస్ట్ సాయం



మెడిసిన్ విద్యార్థి శశి కుమార్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా చెక్కు అందిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, జూన్ 27: ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన మెడిసిన్ విద్యార్థి శశి కుమార్ చదువుకు బీఎల్ఆర్ ట్రస్టు గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు మెడిసిన్ ఫీజు కట్టడం పట్ల ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కేసీఆర్ అభినందించారు. అనంతరం, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మెడిసిన్ చదువాలన్న తపన ఉండి ర్యాంక్ తెచ్చుకున్న పేద విద్యార్థుల ఫీజులను ఐదేండ్లు తాను భరిస్తానన్నారు. పేద విద్యార్థులకు తమ ట్రస్టు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. 'ర్యాంక్ మీది, ఫీజు నాది' అన్న నినాదంతో తమ ట్రస్టు ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి. చిత్రంలో తదితరులు

మల్కాజిగిరి, జూన్ 27: ప్రజల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా కార్యాలయంలో బస్తీ దవాఖానలు, లైబ్రరీలు, ఎంఎంటీఎస్ రెండో ఫేస్‌లో ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం కొత్తగా బస్తీ దవాఖానలు నిర్మించడానికి, లైబ్రరీలు నిర్మించడానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. ముదిరాజ్ సంఘానికి కేటాయించిన స్థలం ఇప్పటికీ వారికి అందజేయలేదని, వెంటనే స్థలాన్ని అందజేయాలన్నారు. బేగంపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలని, నేరేడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌లోని ఇంటర్, డిగ్రీ కాలేజీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చెరువులు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని, తుర్కపల్లి వద్ద ఆర్‌యూబీ నిర్మించడానికి భూసేకరణ చేయాలని కోరారు. కలెక్టర్ గౌతమ్ ఇందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, ఉపేందర్ రెడ్డి, జేపీసీ అధ్యక్షుడు వెంకన్న, అనిల్ కిశోర్, కరమ్‌చంద్, ఢిల్లీ పరమేష్, రమేష్, జీకే హన్మంతరావు, మధుసూదన్ రెడ్డి, తులసి సురేష్, బాలకృష్ణ, అరుణ్‌రావు, సతీష్, తూపాకుల జనార్దన్, అనిల్, సయ్యద్ మోసిన్, ప్రభాకర్, మల్లేశ్ గౌడ్, దిన కరన్ పాల్గొన్నారు.

కోఠి ఈఎన్టీ దవాఖానకు ఎన్టీపీసీ వితరణ

రూ.9.47 లక్షల వీల్ చైర్లు, స్ట్రెచర్లు, ఇతర పరికరాల విరాళం



ఈఎన్టీ దవాఖాన సూపరింటెండెంట్ డా. శంకర్‌కు వీల్‌ఛైర్, స్ట్రెచర్లను అందిస్తున్న సూర్యనారాయణ పాణిగ్రహి తదితరులు

సుల్తాన్ బజార్, జూన్ 27: ప్రభుత్వ దవాఖానలలో పేద రోగుల సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఈఎన్టీ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ తాటి శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు కోఠిలోని ఈఎన్టీ ప్రభుత్వ దవాఖానాలో పేదల సౌకర్యార్థం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సౌత్ రీజియన్ హెడ్ క్వార్టర్స్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రహి, డీజీఎం బద్రుద్దీన్ అన్సారీ, మేనేజర్ ప్రియాంకలు రూ.9.47 లక్షల విలువైన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, టేబుళ్లు, రోగులు కూర్చునేందుకుగా వీలుగా త్రీ సీటర్ అల్యూమినియం కుర్చీలు, చైర్లను విరాళంగా గురువారం ఇచ్చారు. వాటిని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఈఎన్టీ దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ జయ మనోహరి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, డాక్టర్ కె.వెంకట నాగ దుర్గా ప్రసాద్, డాక్టర్ ఓరుగల్లు రవి శంకర్ ప్రజాపతి, ప్రొఫెసర్ అనస్థీషియా డాక్టర్ కె.ఉమా, ఆడియాలజీ డాక్టర్ వీణ, నర్సింగ్ ఆఫీసర్ స్వర్ణలత, పుష్పలత, కేజియా, మాధవి, సరిత, మరియ, రవి, మధు, రజనితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధమైన వాహనాలపై ఉక్కుపాదం

స్పెషల్ డ్రైవ్ చేపట్టిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

ఆటోలను తనిఖీ చేస్తున్న హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

జూబ్లీహిల్స్, జూన్ 27: పాఠశాలలకు పిల్లలను తరలించే వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. చిన్నారులను ఒకరి మీద ఒకరిని కూర్చోబెట్టి ప్రమాదాలకు కారణమవుతున్న స్కూల్ ఆటోలపై ఉక్కుపాదం మోపనున్నారు. ఎక్కువ మంది పిల్లలను ఒకే వాహనంలో స్కూల్‌కు పంపిస్తే ప్రమాదమని, సిట్టింగ్ కెపాసిటీ కంటే ఎక్కువగా పిల్లలను ఆటోలు, వ్యాన్లలో పంపవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పాఠశాల విద్యార్థుల భద్రతపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది పిలల్లను ఎక్కించుకున్న ఆటోలను తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి పెట్టిన పోలీసులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనాలపై ఎక్కువ మంది పిల్లలను తరలిస్తున్న వారికి పిల్లల భద్రతపై కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న నగర ట్రాఫిక్ పోలీస్

లీకేజీ బాధ్యత మోడీ ప్రభుత్వానిదే..

విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి: సీపీఐ (ఎంఎల్)

ముషీరాబాద్, జూన్ 27: నీట్-యూజీ పరీక్షలో జరిగిన కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ అల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావులు డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం జరిగిన తప్పిదానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, నీట్ పరీక్షలో పెద్ద స్కామ్ జరిగినట్లు సాక్ష్యాధారాలు వెలువడినా మోడీ ప్రభుత్వం నోరుమెదపడం లేదని మండిపడ్డారు. 720 మార్కులతో 67 మంది ప్రథమ స్థానంలో నిలవడం చరిత్రలో ఇదే తొలిసారి అని, గ్రేస్ మార్కులు కలపడం పెద్ద తప్పిదమన్నారు. గుజరాత్, హర్యానా, మహారాష్ట్రలలో పేపర్ లీకేజీ జరిగినా, కేసులు నమోదైనా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడం శోచనీయమన్నారు. కొత్తగా ఏర్పడిన మోడీ ప్రభుత్వం గత పదేళ్ల పాలన తరహాలోనే నియంతృత్వంగా వ్యవహరిస్తోందని, ఎన్నికల ప్రచారంలో ప్రధాన స్థాయి వ్యక్తి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం శోచనీయమన్నారు. మహిళల మంగళ సూత్రాలను తొలగించి ముస్లింలకు పంచుతారంటూ విద్వేష పూరిత అక్కసునే వెళ్లగక్కారని అన్నారు. 140 కోట్ల మందికి ప్రతినిధి అయిన ప్రధాని ఈ విధంగా మాట్లాడటం దేశ చరిత్రలో లేదన్నారు. రైతులు పండించే ధాన్యానికి కనీస మద్దతు ధర విషయంలో పార్లమెంటు చట్టం చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్

నీట్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద హోర్డింగ్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు

నేడు బీజేపీ ఎంపీల ఇండ్ల ముట్టడి
ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

హిమాయత్‌నగర్, జూన్ 27: నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు డి.రామకృష్ణ, మహేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష సమస్యపై ప్రధాని మోదీ, బీజేపీ ఎంపీ స్పందించాలని నేడు (శుక్రవారం) బీజేపీ ఎంపీల ఇళ్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ముట్టడికి సంబంధించిన హోర్డింగ్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదేండ్లుగా బీజేపీ హయాంలో నీట్ టెస్టింగ్ ఏజెన్సీలు పరీక్ష నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందిందని, దీంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఎండీ జావీద్, కేఎస్ ప్రదీప్, అశోక్ రెడ్డి, రజినీకాంత్, సాయికృష్ణ, శ్రీహరి, అనిల్, శ్రీమాన్, షేక్ మహమూద్, మాజీద్ అలీ, హష్మీబాబు, బాలు పాల్గొన్నారు.

గచ్చిబౌలి ప్రిజం మాల్‌లో పీవీఆర్ ఐనాక్స్ ప్రారంభం

గచ్చిబౌలి ప్రిజం మాల్‌లో పీవీఆర్ ఐనాక్స్ 4కే లేజర్ ప్రొజెక్షన్ సినిమాస్‌ను ప్రారంభిస్తున్న ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజిలీ

శేరిలింగంపల్లి, జూన్ 27: గచ్చిబౌలిలోని ప్రిజం మాల్‌లో కొత్తగా పీవీఆర్ ఐనాక్స్ 4కే లేజర్ ప్రొజెక్షన్ సినిమాస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో రూపొందించిన ఈ ఐనాక్స్ మూవీ ప్రాంగణాన్ని పీవీఆర్ ఐనాక్స్ ఈడీ సంజీవ్ కుమార్ బిజిలీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నగరంలో పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్‌కు 17 ప్రాపర్టీస్‌లలో 97 స్క్రీన్లు ఉన్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 20 ప్రాపర్టీస్‌లలో 110 స్క్రీన్లు, దక్షిణాదిలో మొత్తం 102 ప్రాంతాల్లో 579 స్క్రీన్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. ప్రీజం మాల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన స్క్రీన్లలో 950 మంది ప్రేక్షకుల సీటింగ్ కెపాసిటీతో ప్రత్యేక హంగులతో కొత్త సినిమా ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

సంక్షేమంనూ దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు

మంత్రి సీతక్క

మలక్‌పేటలో హెలెన్ కెలర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మలక్‌పేట, జూన్ 27: దివ్యాంగులకు విద్యా సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశామని, సంక్షేమ పథకాల్లో కూడా ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవెలప్‌మెంట్, మహిళా, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగుల ఉద్యమనేత హెలెన్ కెలర్ జయంతిని పురస్కరించుకొని గురువారం మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల జాతీయ ఉద్యానవనంలో దివ్యాంగుల హెలెన్ కెలర్ విగ్రహాన్ని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దివ్యాంగ జీవితాల్లో వెలుగులు నింపాలన్న కృత నిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప అవకాశాల్ని కల్పిస్తున్నారన్నారు. జల్, జీవన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామని ఆమె పేర్కొన్నారు. చాలా వరకు గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాటికి త్వరలోనే మోక్షం లభించనుందన్నారు. వికలాంగుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి అరుణ, ఎండి బి.శైలజ, జీఎం ప్రభంజన్ రావు, సంఘాల నాయకులు ఫెడ్ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, గంగారాం పాల్గొన్నారు.

జియో థర్మల్ శక్తి వనరులు కీలకమే..

- అంతర్జాతీయంగా పెరుగుతున్న డిమాండ్
- ఎన్‌జీఆర్ఐ 'వన్ వీక్ వన్ థీమ్'లో పలువురు జియోథర్మల్ నిపుణుల అభిప్రాయం

సిటీబ్యూరో, జూన్ 27(నమస్తే తెలంగాణ): సంప్రదాయ శిలాజ ఇంధన వనరుల కంటే ప్రత్యామ్నాయ, పునరుత్పాదక ఇంధన వనరుల అన్వేషణ దేశానికి అత్యంత కీలకమని పలువురు భూభౌగోళిక అధ్యయన నిపుణులు అభిప్రాయపడ్డారు. వన్ వీక్-వన్ థీమ్ కార్యక్రమంలో ఎన్జీఆర్ఐ గురువారం నిర్వహించిన టెక్నికల్ చర్చాగోష్టిలో పలువురు నిపుణులు పాల్గొన్నారు. జియోథర్మల్ శక్తి వనరుల ఆవశ్యకతను వివరించారు. చత్తీస్‌గఢ్ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఎనర్జీతో కలిసి నిర్వహించారు. ఎనర్జీ అండ్ ఎనర్జీ డివైజెస్ థీమ్‌పై జరిగిన ఇంటరాక్షన్ సెషన్‌లో పండిత్ రవిశంకర్ శుక్లా యూనివర్సిటీ ప్రొ.సచ్చిదానంద్ శుక్లా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రాజేష్ సింగ్ రాణా క్రెడా, ఎన్ఐటీ డైరెక్టర్ రమణా రావు, పలువురు నిపుణులు పాల్గొన్నారు. జియోథర్మల్ నిక్షేపాలను వెలికితీత, అభివృద్ధిపై పలువురు వ్యాఖ్యానించారు. ప్రధానంగా తట్టాపాణి రీజియన్ జియోథర్మల్ నిక్షేపాలపై చర్చాగోష్టిలో నిపుణులు మాట్లాడారు. ఇక ఎన్జీఆర్ఐలో జియోథర్మల్ పరిశోధనలకు అవసరమైన ఆధునాతన సాంకేతిక, లేబోరేటరీ ఉప కరణాలు, జరుగుతున్న అధ్యయనాలను ఎన్జీఆర్ఐ వర్గాలు వివరించాయి. జియోథర్మల్ అన్వేషణ వైపు అడుగులు వేస్తున్న భారత్‌కు ఇదొక దిశానిర్దేశం చేసేలా నిపుణుల ప్రసంగించినట్లుగా ఎన్జీఆర్ఐ వర్గాలు పేర్కొన్నాయి.

పారిశ్రామిక ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ మండల

సమావేశంలో మాట్లాడుతున్న డేనియల్ మండల, తదితరులు

రవీంద్రభారతి, జూన్ 27: పదేండ్ల క్రితం మంజూరైన పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇప్పటి వరకు లబ్ధిదారులకు విడుదల కాకపోవడం ఆవేదన కలిగిస్తుందని ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ మండల అన్నారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 70 వేల పరిశ్రమలు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు బ్యాంకుల సహకారం లేక 20 వేల పరిశ్రమలు మూతపడ్డాయని తెలిపారు. సర్వీస్ సెక్టర్ వాహనాలు పరిశ్రమల శాఖ బ్యాంక్ ఈఎంఐలు వ్యాపార రంగాల వారు ఈఎంఐలు కట్టనందున బ్యాంకులు వారి ఆస్తులు జప్తు చేస్తున్నారన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 450 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల కావాల్సి ఉందన్నారు. టీఎస్ఐఐసీ సైబరాబాద్ శంషాబాద్ జోన్లలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు కేటాయించాల్సిన ప్లాట్ల భూములను పరిరక్షించాలన్నారు. దయానందరావు, ప్రవీణ్,ప్రశాంత్, సురేష్, వేణు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా బృందం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా బృందం

కొండాపూర్, జూన్ 27: హైదరాబాద్ విశ్వవిద్యాలయం, రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాల మధ్య మెరుగైన విద్యా ప్రమాణాలు, పరిశోధనల అభివృద్ధితో పాటు విద్యార్థుల మార్పిడికి కృషి చేస్తున్నట్లు రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా కాన్సుల్ జనరల్ ఎడ్డీ వార్డోయో అన్నారు. రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా కాన్సుల్ జనరల్ బృందం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు వర్సిటీలోని కోర్సులు, పరిశోధనలకు సంబంధించిన వివరాలను వివరించారు. భారతదేశం, ఇండోనేషియాల మధ్యన సాంస్కృతిక, సారూప్యతల గురించ